క్లుప్తంగా

టీటీడీ ఆలయాన్ని దర్శించుకున్న మంత్రి రోజా



వెంకటపాలెం(తాడికొండ): గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెం తిరుమల తిరుపతి దేవస్థానాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సెల్వమణి దంపతులు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు విచ్చేసిన మంత్రి రోజా, ఎమ్మెల్సీ డొక్కాలను టీటీడీ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ సర్వాంగ సుందరంగా నిర్మించిన వెంకటపాలెం టీటీడీ ఆలయం విశిష్ట ఆదరణ పొందుతుందన్నారు. ఈ ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.

నృసింహుని సన్నిధిలో డీఐజీ అమ్మిరెడ్డి



మంగళగిరి: నగరంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామిని డీఐజీ అమ్మిరెడ్డి దర్శించుకున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం ఆలయానికి విచ్చేసిన డీఐజీకి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో నార్త్‌జోన్ డీఎస్పీ జె.రాంబాబు, సీఐ అంకమ్మరావు పాల్గొన్నారు.

శరణాలయాన్ని సందర్శించిన ఆర్టీసీ ఈడీ దంపతులు



మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని షైన్ ఆనంద శరణాలయాన్ని సోమవారం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా బాలబాలికలతో కలసి నూతన సంవత్సర కేకును కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన బాలబాలికలతో మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి దేశం గర్వించే భావి భారత పౌరులుగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా ఈడీ వెంకటేశ్వరరావు దంపతులను శరణాలయం నిర్వాహకులు సంధ్యారాణి, సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడేపల్లి రూరల్: మంగళగిరి– తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాకలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు.. 2022 డిసెంబర్ 25 అర్ధరాత్రి పెనుమాకలో రెండు బైక్‌లు ఎదురుఎదురుగా గుద్దుకోవడంతో పెనుమాకకు చెందిన ఎస్‌కే ఖాసిం అక్కడికక్కడే మృతి చెందాడు. వడ్డేశ్వరానికి చెందిన అనీష్ బాబు(25) మంగళగిరిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని, జరిగిన ఈ ఘటనపై తండ్రి శేషయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. గత నెల 25వ తేదీన మృతిచెందిన ఎస్‌కే ఖాసింకు భార్యా పిల్లలు ఉన్నారు. ఆ కుటుంబానికి అతనే ఆధారం. ప్రస్తుతం చనిపోయిన అనీష్‌బాబు కూడా శేషయ్య సరోజనిలకు ఒక్కగానొక్క కొడుకు. ఇతనే కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, ప్రతినిధులు కృష్ణారావు, రామకృష్ణ, బోనేపల్లి శ్రీనివాస్, రౌతు శ్రీదేవి, పరిమళ, అన్నపూర్ణ, దిల్‌షా పాల్గొన్నారు.

మునగపాడులో పొలంబడి

ఫిరంగిపురం: మండలంలోని మునగపాడు గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం బృంద సభ్యులతో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మిర్చి పంటలో వేరుకుళ్లు, పండాకు, కాయమచ్చతెగులును గమనించి ప్రకృతివ్యవసాయ పద్ధతులు పాటించాలని రైతు దానుకు తెలిపారు. ఈసందర్భంగా ఎస్‌డీఏ అన్నామణి మాట్లాడుతూ కాయమచ్చ , పండాకు తెగుళ్లకు శొంఠి, ముద్ద ఇంగువ ద్రావణంతో నివారించవచ్చని చెప్పారు. రైతులందరు ప్రకృతి వ్యవసాయం పద్ధతులు నేర్చుకొని నాణ్యతతో కూడిన పంటలు పండించాలని తెలిపారు , కార్యక్రమంలో ఎంటీ వీరలక్ష్మి, ఎంసీఆర్పీ వరప్రసాద్, తిరుపతి రావు, సీనియర్ ఐసీఆర్పీ ఇ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు



ఆత్మకూరు వేణుగోపాల స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నృసింహస్వామి దేవస్థాన ఆవరణలో భక్తులకు ఉచిత వైద్య సేవలు అందజేస్తున్న వైద్య సిబ్బంది



నృసింహుని దర్శనానికి విచ్చేసిన భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేస్తున్న వికాస తరంగిణి ప్రతినిధులు



సీతానగరంలో పూజలు నిర్వహిస్తున్న శ్రీదుర్గా మల్లేశ్వర దేవస్థానం ఈఓ భ్రమరాంబ

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరులోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం స్వామి ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవస్థాన మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్ మోతుకూరు రవికుమార్ తో పాటు పందిరి వెంకట నారాయణ, మల్లాది నాగరాజు, తిరువీధుల బాపనయ్య, బొమ్ము శంకరరెడ్డి, కుందేటి రామాంజనేయులు, యర్రమల రాజమ్మ పాల్గొన్నారు.

నృసింహుని దేవస్థాన ఆవరణలో ఉచిత వైద్య సేవలు

నగరంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం దేవాలయం వద్ద గణపతినగర్ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి పి.అనూష ప్రారంభించారు. శిబిరంలో పలువురు భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

వికాస తరంగిణి ఆధ్వర్యంలో..

వికాస తరంగిణి ఆధ్వర్యంలోభక్తులకు పులిహోర, రవ్వ కేసరి ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నందం జోగేంద్ర చక్రవర్తి, డోగిపర్తి శ్రీహరిరావు, ప్రతినిధులు నందం విజయలక్ష్మి, చెక్కా కృష్ణ కిషోర్, జేవీ నారాయణ, మానుకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఫిరంగిపురంలో ఉత్తర ద్వార దర్శనం చేస్తున్న భక్తులు

ఎరుకల సేవా సంఘం ఆధ్వర్యంలో..

ఏపీ ఎరుకల సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పేరం ఏడుకొండలు, పట్టణ అధ్యక్షులు పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దాసరి గోపి, కోశాధికారి కుంభ శేషు పాల్గొన్నారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి

ఫిరంగిపురం: మండంలోని పలు గ్రామాల్లో సోమవారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఆలయాల్లో స్వామివార్లను భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారు. ఫిరంగిపురంలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ విశేషపూజలు చేశారు. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం గీతా భజనమండలి ఆధ్వర్యంలో విష్ణుసహస్రనామపారాయణం, హనుమాన్‌చాలీసా పారాయణం కావించారు. కొండమెట్లరోడ్డులోని నగరేశ్వరస్వామి ఆలయంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో అర్చకులు రాజేంద్రశర్మ స్వామికి విశేషపూజలు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. 113 తాళ్లూరులోని వేణుగోపాలుడి ఆలయంలో అర్చకులు ప్రసన్నమూర్తి స్వామివారికి అష్టోత్తర శతనామ పూజలు చేశారు. స్వామివార్లను దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పానుగుపాడులోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, సీతారామచంద్రస్వామి ఆలయాల్లో అర్చకులు విశేషపూజలు చేశారు. అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి ఆలయంలో అర్చకులు అయ్యన్నశాస్త్రి అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వేములూరిపాడులోని జలపాలేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అర్చకులు ఉమాపతి శాస్త్రి విశేషపూజలు చేశారు. సొలసబ స్టాండు సెంటర్‌లోని సాయినాథాలయంలో స్వామికి అర్చకులు విశ్వనాథశాస్త్రి పూజలు చేశారు.



సీతానగరం విజయకీలాద్రిపై ఉత్తర ద్వార దర్శనంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లోను, దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాల, పెదపాలెం గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం పలు దేవాలయాల్లో ఉత్సవ విగ్రహాలను ఉత్తర దర్శనంలో స్వామివారిని ఏర్పాటు చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం, కొత్తూరు, పెనుమాక, ఉండవల్లి, కొలనుకొండ, వడ్డేశ్వరం, ఇప్పటం, మెల్లెంపూడి ప్రాంతాల్లో రామాలయం, వినాయక దేవస్థానాలు, ఆంజనేయస్వామి దేవస్థానాలు, వెంకటేశ్వరస్వామి దేవస్థానాల్లో ఉత్తర ద్వారదర్శనంలో భక్తులకు దర్శన భాగ్యాన్ని కలిగించారు.

సీతానగరంలో....

సీతానగరంలోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఈఓ భ్రమరాంబ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ ప్రభాత ఆంజనేయస్వామి (ఎండలో చెట్టుకింద ఆంజనేయస్వామి) దేవస్థానంలో ఉదయం స్వామికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. అనంతరం స్వామి వారికి లక్షతమాలర్చన నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఉదయం స్వామి వారికి అష్టోత్తరం, సహస్ర తులసి అర్చన, నక్షత్ర హారతి, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.

దుగ్గిరాలలో ....

దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాలలోని విష్ణు ఆలయంలోను, పెదకొండూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం భక్తులకు ఉత్తర ద్వార దర్శనాన్ని కల్పించారు. ఆలయ అర్చకులు నారాయణం కృష్ణమాచార్యులు వేద మంత్రాల నడుమ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు సోమవారం తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ ట్యాబ్‌లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. నాడు– నేడులో భాగంగా పాఠశాలల అభివృద్ధి చేసి కార్పోరేట్ స్థాయిని మించి ఉండేలా చేశారన్నారు. జగనన్న అమ్మఒడి, అమ్మ దీవెన వంటి పథకాలతో పాటు ఎనిమిదో తరగతి నుంచే విద్యార్థులకు సాంకేతికపరంగా అభివృద్ధి సాధించేందుకు వీలుగా జగనన్న విద్యాకానుకలో భాగంగా బైజూస్ కంటెంట్‌తో నింపిన ట్యాబ్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పింఛన్‌దారులకు నూతన పింఛన్లు అందజేశారు. పాఠశాలలో ఆట స్థలానికి మేరవతోలించాలని, పాఠశాల సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌తో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారంటూ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్, సర్పంచి జి.ఆదంబీ, ఎంపీటీసీ ఖాసింషహీద్, మస్తాన్‌వలి, బాపూజీరెడ్డి పాల్గొన్నారు.



ట్యాబ్‌లు తీసుకున్న విద్యార్థులతో కె.సురేష్, జెడ్పీటీసీ డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షహేలానర్గీస్

పింఛన్లు పంపిణీ

నిడుముక్కల(తాడికొండ): పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు ముఖ్యఅతిథిగా హాజరై పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి మాదాసు రత్నకుమారి, ఎంపీటీసీ బోడపాటి సుశీల, సచివాలయ కన్వీనర్‌లు బందెల సుమన్, కలవకొల్లు రాజ్యలక్ష్మి, అత్తోట అక్కయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి బాకి వెంకటస్వామి, కార్యదర్శి ఆలా సత్యనారాయణ పాల్గొన్నారు.



నిడుముక్కలలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ పున్నారావు, సర్పంచి రత్నకుమారి

పేదల పెన్నిధి జగనన్న

ఫిరంగిపురం: పేదల పెన్నిధి జగనన్న అని సర్పంచి మేడాబాబు అన్నారు. మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో సోమవారం 1,2,3 సచివాలయాల పరిధిలోని నూతనంగా వచ్చిన పింఛన్‌దారులకు వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచి వై.రమాదేవి, కె.చిన్నప్పరెడ్డి, వై.యల్లారెడ్డి, బ్రహ్మయ్య, ఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మేరికపూడి: గ్రామంలోని సచివాలయంలో సోమవారం సర్పంచి పూసల నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో నూతనంగా మంజూరైన పింఛన్ దారులకు పింఛన్ నగదు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి విష్ణువర్ధన్‌రావు, ఎంపీటీసీ సభ్యురాలు హనుమాయమ్మ, పి. వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో పెన్షన్ అందజేత

తాడేపల్లి రూరల్: మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పెనుమాకకు చెందిన వలంటీర్ తన పరిధిలో ఉన్న వృద్ధుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో సోమవారం ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేశాడు. పెనుమాకకు చెందిన వృద్ధుడు సంగీతరావు అనారోగ్యంతో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం పెన్షన్ ఇవ్వడానికి వెళ్లగా ఆస్పత్రిలో ఉన్నాడని తెలుసుకున్న వలంటీర్ అందె రాజు విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేశాడు.



ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న వృద్ధుడికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ రాజు

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్: నూతన సంవత్సరం– 2023 క్యాలెండర్‌ను సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. తాడేపల్లిలోని కృష్ణాకెనాల్ రైల్వే జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టీఆర్‌డీ బ్రాంచ్ డివిజన్ సెక్రటరీ బి.శ్యామ్‌బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ ఎంప్లాయిస్ సంఘ్ టీఆర్‌డీ బ్రాంచ్ నాయకులు పలుకూరి సుబ్బారావు, కట్టా వసంతరావు, జి. గాబ్రియేల్, తిలక్, యస్‌కె ఖాజా, దొరస్వామి, ఎ.సోమశేఖర్, కె.అశోక్ పాల్గొన్నారు.

దుగ్గిరాలలో .....

నూతన సంవత్సరం సందర్భంగా దుగ్గిరాల యూనిట్ ఏపీజీఈ అధ్యక్షులు అందె బాలచంద్రమౌళి ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను తహశీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం దుగ్గిరాల యూనిట్ ఉపాధ్యక్షులు దమ్ము ఆశీర్వాదమ్మ, పులివర్తి చిట్టిబాబు, కె.విజయభాస్కర్, భవాని పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిపురంలో అభివృద్ధి పనులపై గ్రామసభ

మేడికొండూరు: మండలంలోని మేజర్ పంచాయతీ సిరిపురంలో పలురకాల అభివృద్ధి పనులపై కార్యచరణ, సమీక్ష గ్రామసభ సోమవారం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచి కుంభా త్రివేణి మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ఆమోదించినట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి బందెల రమేష్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ప్రణాళిక రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఇన్‌చార్జి కుంభా శివయ్య, అంజయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు జోసఫ్ రెడ్డి పాల్గొన్నారు.

చకచకా తాగునీటి పైప్‌లైన్ పనులు



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట శివదుర్గాపురంలో తాగునీటి పైప్‌లైన్ల పనులు సోమవారం వేగంగా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇటీవల డోలాస్‌నగర్, నులకపేట ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. ఆ సమయంలో నులకపేట శివదుర్గాపురంలో తాగునీటి పైపులైన్లు సరిగా లేక తాగునీరు రావడం లేదని మహిళలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డితో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికపై తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్పందించిన అధికారులు శివదుర్గాపురంలోని నాలుగు రోడ్లలో తాగునీటి అవసరాల నిమిత్తం కొత్త పైపు లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం తాగునీటిని అందజేస్తామని డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, తహసీల్దార్ మల్లేశ్వరి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఎంఈఓ శ్రీనివాస్‌తోడైరీని ఆవిష్కరింపజేశారు. దుగ్గిరాల ఎస్‌టీఓ మేరి ఆధ్వర్యంలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలతో డైరీ ఆవిష్కరింపజేసి వారిని సత్కరించారు.

కేఎల్‌యూను సందర్శించిన పెరూజియా అధ్యాపకులు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయాన్ని సోమవారం ఇటలీలోని పెరూజియా విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్‌పై పలు పరిశోధనలు చేసి, ఎన్నో ఆవిష్కరణలు కనిపెట్టిన డాక్టర్ ఓస్వాల్డో గెర్వాసి సందర్శించారని విశ్వవిద్యాలయ ఎంహెచ్‌ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఓస్వాల్డో గెర్వాసి ఏడు రోజుల పాటు తమ విశ్వవిద్యాలయంలోని సీఎస్‌ఈ విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ తరగతులను నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్ ఓస్వాల్డో గెర్వాసిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకటరామ్ పాల్గొన్నారు.

కుప్పంలో బాబు, మంగళగిరిలో లోకేష్ ఓటమి ఖాయం

- పవన్ కళ్యాణ్ నాయకుడంటే ఎవరూ నమ్మరు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

మంగళగిరి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబు నాయుడు, మంగళగిరిలో లోకేష్‌ల ఓటమి ఖాయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే ఆర్కే అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలతో జనం సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అండగా నిలబడ్డ నాయకులు దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిలేనన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు లోకేష్‌లు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోగా ప్రజలను పట్టించుకోవకపోవడం వల్లనే మంగళగిరిలో లోకేష్ ఓడిపోయారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ రాజకీయ నాయకుడు అంటే ఎవరూ నమ్మే పరిస్థితి లేదని, సినిమా హీరోగా ఆయన సక్సెస్ అయితే అయి ఉండొచ్చని, కేవలం చంద్రబాబు విజయం కోసమే పవన్ కళ్యాణ్ పని చేస్తాడని ప్రజలు నమ్ముతున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.



ఎన్నారై జంక్షన్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

ఎన్నారై జంక్షన్‌లో నేతన్న మగ్గం..

నగర పరిధిలోని ఎన్నారై జంక్షన్‌లో స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే నేతన్న మగ్గం విగ్రహాల ఏర్పాటును వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. ఫిబ్రవరి నాటికి విగ్రహాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

జాతీయ కవి సమ్మేళనానికి ఎంవీ రామిరెడ్డి ఎంపిక



తాడికొండ: ఆకాశవాణి ఏటా నిర్వహించే జాతీయ కవి సమ్మేళనానికి 2023 ఏడాదికి గుంటూరు జిల్లా పెదపరిమి గ్రామానికి చెందిన ఎంవీ రామిరెడ్డి తెలుగు భాష నుంచి ఎంపికయ్యారు. భారతీయ భాషలకు సంబంధించి 23 మంది కవుల కవితలను ఆకాశవాణి ఈ నెల 10వ తేదీన ఢిల్లీలోని రంగ్ భవన్‌లో రికార్డు చేయనుంది. స్వాతంత్ర్యం సాధించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఎంవీ రామిరెడ్డి రాసిన అమృతోపనిషత్ కవితను తెలుగు భాష నుంచి ఎంపిక చేశారు. ఈ కవితను అన్ని భారతీయ భాషల్లోకి అనువదించి ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారం చేయనున్నారు. కవిగా, కథా రచయితగా ఎంవీ రామిరెడ్డి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పటి దాకా 3 కథా సంపుటాలు, 4 కవితా సంపుటాలు ప్రచురించారు. ప్రస్తుతం రామ్‌కీ ఫౌండేషన్ ప్రెసిడెంట్‌గా, హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఆయన తన స్వగ్రామమైన గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం పెదపరిమిలో తండ్రి స్మారకంగా మువ్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్టు స్థాపించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇదే గ్రామంలో ప్రత్యేకంగా నిర్మించిన భవనంలో వృద్ధాలయంతో పాటు నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు.

ధాన్యం కల్లాలను పరిశీలించిన సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి గ్రామంలో ధాన్యం కల్లాలను రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు రైస్ మిల్లు పొన్నూరుకు ధాన్యాన్ని పంపించాలని, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు ప్రస్తుతం తామే భరిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా గోతాల ఖర్చు, హమాలీల ఖర్చులు భరించి రైస్ మిల్లుకు తరలించాలని సివిల్ సప్లయ్ వారు అంటున్నారని వాపోయారు. జొన్నా శివశంకరరావు స్పందించి రైస్ మిల్లును గతంలోలాగా యర్రబాలేనికి మార్చాలని, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు, హమాలీ చార్జీలు, గోతం ఖర్చులు వెంటనే రైతులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.ఈశ్వర్‌రెడ్డి, భక్తిరెడ్డి వీరాస్వామి పాల్గొన్నారు.